# సంఘం గెలిచింది మనిషి ఓడిపోయాడు

బుద్ధరాజు సన్యాసిరాజు

## 'పోస్ట్'

సగటు తెలుగు సినిమాలో వినిపించే అతి సాదా డైలాగు విని వెళ్ళి తలుపు తెరిచాను.

పావుకేజీ బరువున్న కవరు వుంది.

'పత్రికకి పంపిన కథగాని తిరిగొచ్చేసిందేవిటి చెప్మా!' అని గాబరాపడ్డాను. కాదు.

దానిమీద ఎడ్రసు నా చేతి వ్రాతకాదు. 'హమ్మయ్య.'

ఫ్రం ఎడ్రసు చూసాను.

'సాంబ – అంబటి సత్రం – విజయనగరం.'

'ఈ దౌర్భాగ్యుడికి ఇప్పటికి గుర్తు కొచ్చానన్న మాట.'

నేను మద్రాసొచ్చేసి రెండేళ్ళయింది. కాని వాడిదగ్గరి నుంచి ఇదే మొదటి ఉత్తరం.

'ఆ మాటకొస్తే నువ్వు పరమ వీర దౌర్భాగ్యుడివి. నువ్వీ రెండేళ్ళలోనూ ఒక్క ఉత్తరం కూడా రాయలేదుగా' అంది మనస్సు.

నిజవే.

కవరు చించి ఉత్తరం తీసాను.

''సన్నీ !

నీకు నేను ఉత్తరం రాయవలసి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు ... మనం 'టాంక్ బండ్' మీద కూర్చుని ప్రతి సాయంకాలం ఏవో కబుర్లాడు కునేవాళ్ళం. ఒకరోజు ... అదే, నీకు మద్రాసు ట్రాన్స్ఫర్ అయేముందు...చాలా గట్టిగా వాదించు కున్నాం. బహుశా నీకు గుర్తుండే వుంటుంది ... ఏఁవిటీ ? ఏ విషయంమీదా ? వెధవా ! అంత మతి మరుపేఁవిటీ ?! ... పోనీ... ఇదిగో చిన్న 'క్లూ'... 'ఫ్రీ సెక్స్'...''

ఆఁ...ఆఁ... కరెక్ట్...కరెక్ట్... గుర్తొచ్చింది.

కళ్ళు మూసుకుని నా బుర్రలో నేనే సినిమా చూస్తున్నాను.

సార్... సార్... మేడమ్... ఓ పాఠక మహాశయులూ... విత్ యువర్ కైండ్ పర్మిషన్... అంతా మీకు చెప్పేస్తానండీ... ప్లీజ్.

ఆ వెధవా, నేనూ (ఆ వెధవంటే ఆ సాంబగాడు— దగ్గిర లేడుగా ఇప్పుడు భయపడ్డానికీ) ప్రాణ స్నేహితులం. వరసకు అన్నదమ్ములంకూడా. మా యిద్దరిమధ్యా ఏ అరమరికలూ వుండేవికావు. వాడితో మాట్లాడందే రోజు పూర్తయ్యేదికాదు నాకు. కారణం ఏమీటంటే వాడి ఆఫీసుకు వెళ్ళి కలవాలంటే విజయనగరానికున్న అతి మంచి రోడ్డు... అదే, టాంక్‌బండ్ రోడ్డుమీదుగా ఓ మైలున్నర దూరం నడిచివెళ్ళాలి. వాడి ఆఫీసు పని అయిన తరువాత ఇద్దరం వచ్చి, టాంక్‌బండ్‌మీద కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, రోడ్డుమీద పోయే వాహనా లను, జనాన్ని పరికిస్తూ పిచ్చాపాటీ మాట్లాడు కోవటం అలవాటు.

ఆ రోజూ అలాగే జరిగింది.

రోడ్డు ప్రక్కగా ఉన్న మెట్లమీదినుంచి గట్టు ఎక్కి, రోజూ కూర్చున్న స్థలంలో చతికిలబడ్డాం.

గట్టు మొత్తం చక్కని పూలమొక్కలు పెంచారు.

గట్టంతా పార్కులాగ తయారుచేసారు.

గట్టు దిగువ వెడల్పైన రోడ్డు.

రోడ్డు నానుకొని సుమారు మూడు నాలుగు మైళ్ల దూరం పచ్చనిపొలాలు.

వాటికి 'నీటి ఎద్దడి' అంటే ఏమిటో తెలీదు– శ్రీమంతులకి ఆకలేమిటో తెలియనట్టు.

సమయం ఆరు కావస్తోంది.

తప్పుచేసి దొరికిపోయినవాడిలా సూర్యుడి మొహం వెల వెలబోతోంది.

పగలంతా నీటిమొక్కల మొగ్గలను మేసిన పక్షులు బరువుగా రెక్కలువిదిల్చి గుంపులు గుంపులుగా పశ్చిమానికేసి ఎగిరాయి.

విహంగాలు తనని పట్టుకుంటాయేమో అని భయపడి, సూర్యుడు అతివేగంగా కొండల్లో దాక్కున్నాడు.

సూర్యుడి పలాయనం కళ్లారా చూసిన శీతల పవనాలు తమ సామ్రాజ్యాన్ని నెలకొల్పాయి.

నిరంకుశ పాలన అంతరించి 'సస్యస్వామ్యం' ఏర్పడినంతగా సంతసిల్లి, ప్రతిపైరూ, చెట్టూ చేమా, ఊగి తూగి, ప్రక్కవాటితో స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నాయి.

ఇద్దరం మైకంగా ప్రకృతి అందాన్ని, సౌరభాల సుఖాల్ని అనుభవిస్తున్నాం.

పురపాలక సంఘంవాళ్ళు ఏర్పాటుచేసిన దీపాలు వెలిగాయి.

''ఈ దౌర్భాగ్యులకి ఎక్కడ దీపాలు వెయ్యాలో, ఎక్కడ వెయ్యగూడదో కూడా తెలీదు'' గొణుగు తున్నాడు సాంబ.

''ఏఁవిట్రా గొణుగుతున్నావ్ ?''

''గొణుగుడుకాదు నాన్నా. మన మునిసిపాల్టీ వాళ్ల తెలివితేటల్ని ప్రశంసిస్తున్నాను... గత కొద్దిసేపూ ఉన్న ఆహ్లాదం, తన్మయత్వం ఇప్పుడు వుందా ? ఇంత ప్రశాంతమైన వాతావరణంలో దీపాలు కావాలని ఎవడేడ్చాడు ?''

''నువ్వు ఏడ్చినా, ఏడవకపోయినా పబ్లిక్ ప్లేసెస్‌లో వాళ్ళు దీపాలేర్పాటు చెయ్యాలి. అది వాళ్ల విధి. ఇక్కడ ఆ లైట్లే లేకపోతే పోలీసోళ్లకి కనీసం నాలుగైదు 'నూసెన్స్' కేసులు దొరుకు తాయి ప్రతిరోజూ'' అన్నాను.

వాడి మొహం క్రోధంగా తయారయింది. అదే కావాలి నాకు. అప్పుడుగాని చర్చా కార్యక్రమం రూపొందదు.

''నీ ఉద్దేశంలో 'అది' నూసెన్స్ అన్నమాట'' అన్నాడు నావేపు ఏవగింపుగా చూసి

''ముమ్మాటికీ. చట్టబద్ధం కాని పనేదైనా నూసెన్సే.'' వాడిని ఇంకా ఇరిటేట్ చెయ్యాలని అన్నాను.

వాడు ఉగ్రుడైపోయాడు.

''చట్టమూ చట్టుబండామూ — చచ్చువెధవా. చంద్రమండలానికి రోజుకో రాకెట్టు వెళ్లే రోజుల్లో కూడా ఛాందస భావాలొదల్లేదు. ఏది చట్టం కాదు ? లంచాలు పుచ్చుకోకూడదని చట్టం వుంది. కట్నాలు పుచ్చుకోకూడదని చట్టం వుంది. ఈ రెండు చట్టాల్నీ ఎంతమంది ఆచరణలో పెడుతున్నారు ? ఎంతమందిని ప్రభుత్వం శిక్షిస్తోంది ? ప్రకృతిసిద్ధమైన కోరికలు తీర్చుకోవ డానికి ఒక ఆడా, మగా వారికి నచ్చిన పని చేసు కోవడం తప్పా ? ప్రతివాడూ తన కిష్టమైన పని చేసుకోవచ్చు, అయితే ఆ పని ఎదుటివారికి అభ్యంతరకరం కాకూడదు. అంతేగదా ? ప్రస్తుతం మనం నూసెన్సు కేసుల విషయం మాట్లాడు తున్నాం. ఉదాహరణకి ఒక జంట కలిసి వాళ్ల వాంఛల్ని తీర్చుకుంటున్నారనుకుందాం. ఆ యిద్దరిలో ఏ ఒక్కరూ ఇంకొకరికి (ఎదటివారికి) అభ్యంతరకరమయ్యే పని చెయ్యటంలేదు కదా. పైగా ఇద్దరిలో ఒకరికి నచ్చేపని ఇంకొకరు చేస్తున్నారు. కనుక ఏ విధంగానూ వాళ్ళు దోషులు కారు. అలాగే ఇక్కడ నాలుగైదు జంటలు అలాంటి కార్యక్రమాల్లో ఉన్నారనుకుందాం. అందులో ఏ జంటా ఇంకో జంటకు అభ్యంతరకరం కాదుకదా! ఇంకో విషయం— ఏ జంటయినా ఇలాంటి పనికి ఉపక్రమించిందంటే సహజంగా చుట్టుప్రక్కల ఎవరూ లేరనేగా అర్థం. అలాంటప్పుడు వాళ్ళు చేసేపని అభ్యంతరకరం ఎలా అవుతుంది ? నేరం ఎలా అవుతుంది ? అంటే, మనం ఆలోచిస్తే ఈ ప్రక్రియ కేవలం పోలీసులకే అభ్యంతరమన్నమాట. కదా ? అంటే, చట్టాన్ని కేవలం పోలీసులే తయారుచేసుకుని వాడుతున్నారన్న మాట. మరి అలాంటప్పుడు నీకు పౌరసత్వం ఎందుకు? ఓటు ఎందుకు? అన్నీ చట్టం ప్రకారమే జరగాలంటే నీకు స్వేచ్ఛ ఎక్కడుంది ? స్వేచ్ఛ లేకుండా స్వతంత్ర్య భారతదేశంలో ఉంటున్నామని అనుకోవడం ఆత్మవంచన కాదా ? ... ఛి ... ఛీ...

సీలాంటి చదువుకున్న మూర్ఖులున్నంత వరకూ దేశ పురోగతికి పనికొచ్చే ఓ పావు సంస్కరణ కూడా జరగదు."

"ఇంతకీ నువ్వు చెప్పబోయేదేమిటి ?"

"ఏముందీ. ప్రకృతి సిద్ధమైన పనులు చేసుకోవడానికి సర్వ స్వతంత్ర్య, ప్రజాస్వామ్య దేశంలో ఎటువంటి అడ్డంకులూ ఉండకూడదు."

"అంటే ఆడా, మగా ఎవరికి నచ్చినట్లు వాళ్ళ తిరగొచ్చంటావ్. వాళ్ళమీద చట్టరూపేణా గాని, సంఘంలోగాని ఎటువంటి అడ్డంకులూ ఉండకూడదంటావ్. అంటే 'ఫ్రీ సెక్స్' ఉన్న సొసైటీ కావాలంటావ్. అవునా ?"

"అవును. దానివల్ల నష్టమేమిటి ?"

"బోలెడున్నాయి సోదరా. ఫ్రీసెక్స్ ఉన్న సొసైటీలో వివాహాలకుగాని, ఆ కట్టుబాట్లకుగాని పెద్దగా ప్రాముఖ్యం వుండదు. ఆడా, మగా కోరిక కలిగినప్పుడు కల్సుకుంటారు. ఇష్టం లేనప్పుడు విడిపోతారు. ఆత్మీయతలు, బంధుత్వాలు మృగ్యం. పుట్టిన పిల్లలకు జ్ఞానం తెలిసేసరికి తల్లీ, తండ్రీ కలిసే ఉంటారని నమ్మకమేమిటి? వాళ్ల సంరక్షణ బాధ్యతాయుతంగా చూసి, బాగుచేసే వాళ్లెవరు ? అది ఒక విషయం. పోతే, ఆత్మీయతలు మృగ్యమైన సమాజంలో ముసలి తల్లిదండ్రుల్ని పోషించేదెవరు ? ఇదంతా దేశవినాశనానికి, సంఘ దుర్బలతకు కారణం కాదా ?"

"ఏడిసినట్లుంది నీ సమర్థింపు. ప్రతివాడూ ఆలోచించే రీతిలో నువ్వెందుకాలోచించాలి? అభివృద్ధి చెందిన దేశాలన్నిట్లో సుమారుగా 'ఫ్రీ (సెక్స్) సొసైటీ' అమల్లో ఉంది. దానివల్ల ఆ దేశాలన్నీ అడుక్కుతింటున్నాయా ? సాంఘిక వ్యవస్థ అడుగంటిపోయిందా ?... ఏదయినా మనిషి ఆలోచనని బట్టే దేశ పురోగతి వుంటుంది. ఇక్కడ మనకు నచ్చిన అమ్మాయిని కనీసం చూడలేంగదా. ఒకవేళ ఏ ఒక్కడో తెగించి మాట్లాడ్డానికి ప్రయత్నించినా, ఆ అమ్మడు ఓ పెద్ద పతివ్రత పోజు పెట్టి 'నీకు అక్కలు లేరా, చెల్లెళ్లు లేరా' అంటుంది. ఏం ? అక్కలూ,చెల్లెళ్లూ లేనివాడే దాంతో మాట్లాడాలా? మాట్లాడితే ఆవిడ పాతివ్రత్యం దెబ్బతింటుందా ? ఈ లోపల ఈ వ్యవహారం చూస్తున్న చుట్టు ప్రక్కల జనం వాడికి చేతిపూజో, కాలిపూజో చేస్తారు. ఏమాత్రం పౌరుషం వున్నవాడయినా, వాడిలో విధిగా ప్రతీకారవాంఛ మొలుస్తుంది. అవునుమరి, వాడు శిక్షింపబడేటంత నేరం చెయ్యలేదే! అక్కడినుంచి మొదలవుతాయి 'కిడ్నాప్'లు, 'రేప్'లు. ఇది మాత్రం దేశానికీ, సంఘానికీ ఆరోగ్యకరమా ? చెప్పు."

"కేరీ ఆన్"

"...అందుకే మనిషికి కూడు, గుడ్డ, గూడు, ఎంత అవసరమో, మానసిక, శారీరక ఆరోగ్యానికి, వాడు భావనచేసే పరిధిలో దొరకగలిగే సెక్సు కూడా అంత అవసరం. సొసైటీలో ఫ్రీ సెక్స్ ఉన్నప్పుడే అది సగటు మానవుడికి లభిస్తుంది. అలాంటప్పుడు మనిషి ప్రస్తుత వ్యవస్థ ప్రకారం సంసార బాదర బందీల వల్లఅనుభవిస్తున్న 'టెన్షన్' అనుభవించడు. తను చేస్తున్న పనిలో నూరు శాతం లీనమౌతాడు. ఉత్పత్తి పెరుగుతుంది, దేశం సుభిక్షమవుతుంది."

"బాగానే చెప్పావు ... కానీ, నేను చెప్పిన అభ్యంతరాలన్నిటికీ నువ్వు సమాధానం చెప్పలేదు."

"చెప్తున్నాను ... ఇద్దరూ హాయిగా ఉండగలిగినంతకాలం కలసివుంటారు, లేకపోతే విడాకులు తీసుకుంటారు. పిల్లల బాధ్యత ప్రభుత్వం వహిస్తుంది. అందరి బాధ్యతా ప్రభుత్వానిదే కాబట్టి వారి వారి అభిరుచుల్నిబట్టి, చాకచక్యం, నైపుణ్యాలనుబట్టి వాళ్లకు కావల్సిన చదువు చెప్పిస్తుంది. అందుచేత ఇప్పటిలాగా డబ్బున్నవాళ్లే డాక్టర్లు, ఇంజనీర్లు, ఐ. ఏ. యస్.లు అయ్యే




అవకాశం తగ్గి, కేవలం అభిరుచి, నైపుణ్యం ఉన్నవాడు మాత్రమే కాగలుగుతాడు. అది దేశానికి మరింత మంచిదికదా. కొన్నాళ్ల తర్వాత వాళ్లే దేశ భవిష్యత్తును సక్రమంగా తీర్చిదిద్దుతారు. ఇకపోతే, ముసలివాళ్ల సంగతి. వాళ్లని కూడా ప్రభుత్వం ఒక నిర్ణీత వయస్సు వరకు ప్రత్యేకమయిన పనులకు నియోగించి, వాళ్ల పోషణ భారాన్ని స్వీకరించుతుంది. పిల్లలకు, ముసలివాళ్లకు తగిన వైద్య సదుపాయాలు కల్పిస్తుంది."

"ఆపావు. చాలా చక్కగా చెప్తున్నావు. రాత్రేవన్నా కలగన్నావా ? ప్రస్తుత పరిస్థితులు చూస్తున్నాక కల మాత్రం ఎలా వొచ్చిందీ అని. మైడియర్ బ్రదర్, నీ ఉద్దేశాలు చక్కగా ఉన్నాయి. అయితే అవి ఇంకో దశాబ్దం పోయినా భారతదేశంలో నెలకొనే పరిస్థితి రాదు. ఎందుకంటే, ప్రజా నాయకుడిగా ఎన్నికైన ప్రతివాడూ అది తన నుదుట రాసిపెట్టి ఉందనుకుంటాడు తప్ప, ప్రజలు తనని ఎన్నుకున్నారనీ, ఆ ప్రజల బాగోగులు చూడటం తన బాధ్యత అనీ ఒక్కడైనా త్రికరణ శుద్ధిగా... చెయ్యకపోతే పోయె, అనుకుంటున్నాడా ? పోనీ ఓటు వేసేవాడయినా మంచివాడికి ఓటు వేస్తున్నాడా ? దేశంలో ఓటేసే జనాభాలో అరవై శాతం నిరక్షరాస్యులు, ఓ యిరవై శాతం చదువుకున్న మూర్ఖులు... కోపగించుకోకు, నాలాగా అన్నమాట. ఇక సవ్యంగా దేశం, ప్రజలు అని ఆలోచించేవాళ్లు ఓ అయిదు శాతం అనుకో, మిగతా పదిహేను శాతం 'దేహం మిధ్య, దేశం మిధ్య' అని ముక్కు మూసుక్కూచునేవాళ్లు. పైన చెప్పిన అరవై + ఇరవై శాతం ప్రజల వరం పట్టి, వాళ్ల మహో

దౌర్బల్యాన్ని డయాగ్నోస్ చేయగల 'థీరి' మన నాయకులకి తెల్సు. ప్రాక్టికల్‌గా ప్రూవ్ అయింది కూడా. ఎలక్షన్ల టైములో మంచి మందు వాడతారు... బస్, పరిస్థితి మామూలే. అందుకే ఏ గడ్డికరిచో ఓసారి ఎన్నికైనోడు జీవితం మొత్తం రిటైరవ్వాలి తప్ప, పదవినుంచి రిటైర్ కాదు. ఆ ధీమా వాళ్లకుంది. ఉండొచ్చు... ఉంటుంది. కాబట్టే వెర్రి తండ్రీ, మన నాయకులు ప్రజలకు పనికొచ్చే పనులేమీ చెయ్యరు. ఒకవేళ ఎవడైనా చెయ్యాలనుకుంటే వాడికి అధికార పక్షంలో, నూకలు చెల్లుతాయి..."

"నీ ఆలోచన పంథా వీసమెత్తు కూడా దాటకుండా చెప్తున్నావు. నీ స్వభావమే అంత. ఏదీ జరగదని కూర్చోవడం నీ లక్షణం. నీలాంటి పెసిమిస్టులవల్ల దేశానికి ఏమాత్రం ఉపయోగం లేదు."

"అంటే, అది జరగాలి, ఇది జరగాలి అని గాలి కబుర్లు చెప్తే సరిపోతుందా ?"

"గాలి కబుర్లెందుకు చెప్పాలి? ఏదైనా మనం చెప్తే చెయ్యగలగాలి. ఇప్పటి విషయమే తీసుకుందాం. నేను ఫ్రీ సెక్స్‌ను ఒప్పుకునే సొసైటీ కావాలంటున్నాను. గనక, నేను ఆ సిద్ధాంతాల్ని నమ్మి ముందుకెళ్తాను ... నా వ్యవహారాలన్నీ నీకు తెలుసు గదా. రమ నాతో కొన్నాళ్లు తిరిగింది, పెళ్లిచేసుకోమంది. నా భావాలు చెప్పాను. ఒప్పలేదు. వేరే ఎవణ్నో పెళ్లిచేసుకుని హాయిగావుంది. ఇప్పుడు నేనూ, విజయా తిరుగుతున్నాం. ముందు ముందు చికాకులు లేకుండా అన్ని విషయాలూ చెప్పాను. ఒప్పుకుంది. పొత్తు కుదిరినన్నాళ్లు కలిసి ఉంటాం. ఎవరికిష్టంలేకపోయినా వాళ్లదారి వాళ్లం చూసుకుంటాం."

"ఒంట్లో ఉడుకు రక్తం ఉన్నంతకాలం చాలా మంది చెప్పేమాటలే ఇవి. అసలు నువ్వు నీ ఉనికిని మర్చిపోతున్నావ్. నీ ఇష్టం వచ్చినట్లు గెంతడానికి మన చట్టం, సంఘం అంగీకరించవు. అంతవరకెందుకు, ఇంట్లో పెద్దవాళ్లే ఒప్పుకోరు."

"నోరు ముయ్యిరా పిరికి సన్నాసీ. దేనికైనా ధైర్యం, ఆత్మవిశ్వాసం కావాలి. నీకా రెండూలేవు...

## సంఘం గెలిచింది...

నీతో అసలు ఈ విషయాలు మాట్లాడటమే శుద్ధ వేస్టు ... ఛి ... ఛీ."

"నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది. ఏదో ఒకరోజు నువ్వు జీవితంలో ఓడిపోతావ్. ఆ రోజు నిన్ను చూసి నువ్వే సిగ్గుపడతావ్."

సినిమా విలన్‌లా నవ్వాడు నా మాటలకి.

"పంచదార కేజీ పావలాకే దొరికేరోజు రావచ్చుగాక, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో 'హరిత విప్లవం' వల్ల రెండు జిల్లాలూ 'అన్నపూర్ణ' లగుగాక, 'కుటుంబానికో ఉద్యోగం' పథకం ప్రభుత్వం మాటికి మూరుపాళ్లూ అమలు జరిపేసిన రోజు వచ్చినా వచ్చుగాక... కానీ మై డియర్ ఫూల్, ఈ సాంబ సిగ్గుపడే రోజు రాదు, రాబోదు... హహహ ..."

అదండీ ఆ రోజు జరిగిన విషయం.
మరి ఉత్తరం పూర్తిచెయ్యనా ?


"... ఆ రోజు అలా ఛాలెంజ్ చేసిన వాణ్ణేనా నేను ? అని అనుకుని, నువ్వన్నట్టుగా నన్ను చూసి నేను సిగ్గుపడుతున్నాను. సన్నీ!... జీవితం మనం అనుకున్నంత జులాయిగా గడవదని అర్థం చేసుకుంటున్నాను. ఇప్పుడు జీవితంతోను, పరిస్థితులతోను రాజీపడిపోయానని ఒప్పుకుంటున్నాను. అసలేం జరిగిందో రాయనేలేదు నేనింతవరకూ.


విజయా, నేనూ కలిసి తిరిగేవాళ్లం. వాళ్లింట్లో వాళ్లెప్పుడూ మాకు అడ్డు చెప్పలేదు. విజయవాళ్ల అన్నయ్య నాతో సరదగా ఉండేవాడు. నా భావాలన్నీ నా చెల్లికి కూడా నేర్పాను. అమ్మా, నాన్నా ఒక ప్రక్క మందలిస్తున్నా, వాళ్లని కేర్ చెయ్యలేదు. చెల్లికి విజయవాళ్లన్నయ్యతో పరిచయం పెరిగింది. కొన్నాళ్లు గడిచాయి. చెల్లి కాలు జారిందని చుట్టుప్రక్కలవాళ్లు అన్నారట — ఓ రోజు నాన్న నామీద విరుచుకుపడ్డారు — నా ప్రభావంవల్లనే అది చెడుతిరుగుళ్లు తిరుగుతోందని. నాలుగు రోజుల తర్వాత ఓ రోజు నాన్న, చెల్లిని గొడ్డును బాదినట్టు బాదుతున్నారు. చుట్టుప్రక్కల ఉన్న ఆడ జనం మూగారు. వాళ్లని చూసి మరీ రెచ్చిపోయారు నాన్న. అమ్మ ఏడుస్తోంది. నేను అడ్డుకోబోయాను నాన్నని. నన్ను చాలా మాటలన్నారు. విషయం బోధపడింది నాకు. 'పెళ్లి కాకపోతే తల్లి కాకూడదా ?' అన్నాను, నా ఆధునిక భావాల ప్రేరేపణమీద, ఉద్రేకంగా. అంతా నన్ను పురుగుని చూసినట్టు చూసి, చావడి మెట్లమీద ఉమ్మి, వెళ్లిపోయారు. ఆ రాత్రి చెల్లి ఆత్మహత్య చేసుకోబోయింది అమ్మ కేకలేసి నానా గందరగోళం చేసింది. దాని పెళ్లి చెయ్యకపోతే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటానంది ... నాన్న ఎవ్వరితోనూ మాట్లాడటంలేదు. అమ్మ మంచం పట్టింది ... విధిలేక విజయద్వారా వాళ్లన్నయ్యతో పెళ్లి విషయం కదిపాను. నేను విజయను చేసుకుంటే, తను చెల్లిని చేసుకుంటానన్నాడు ... నా భావాలు చెప్పాను...గంగలో దూకమన్నాడు నన్నూ, మా కుటుంబాన్నీ. 'నీకుండే భావాలు నాకు మాత్రం లేవని ఎందుకనుకున్నా'వన్నాడు. నాకు అతను చెప్పింది నిజమే అనిపించింది. నా సంకుచితం నాకు

### "కన్ను"

తీక్షణ వీక్షణా బాణాలను
అతి జాగ్రత్తగా దాచుకొన్న
అందమైన అంబుల పొది... అది —
గాఢమైన ప్రేయసీ ప్రియుల్లాంటి
రెండు రెప్పల్ని అప్పుడప్పుడూ కలిపి
కౌగిలింతల్ని ప్రసాదించే గది... అది —
బాష్పకణాల బాణీలను కూర్చి
విషాద గీతికలను తరచుగా
విన్పింపచేసే విపంచిక... అది —
రాత్రి సుషుప్తి శీతలాన్ని
వదలగొట్టుకొంటూ... వెచ్చగా
రసమయ స్మృత్యాగ్ని కణాలను
రగిలించే వాసంతిక... అది—!

—వీరవల్లి వీణావాణి





# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### బి. ఎ. — కటక్

నాకు మూడు సంవత్సరములనుండి తరచు నీళ్ళ విరోచనాలు అవుతున్నాయి. రక్తం గూడా పడుతుంది. చాలామంది డాక్టర్లకు చూపించాను. ఎన్నో మందులు వాడాను. ఎక్స్‌రే తీసి ఏమీలేదని అన్నారు. ఆఖరికి 'కొలైటిస్' అని చెప్పారు. మందులు వాడగానే తగ్గుతుంది. మరలా 10 రోజులకి ఆరంభం అవుతోంది. దీనికి నివారణ తెల్పండి ?

★ అల్సరేటివ్ కొలైటిస్ అనే లక్షణం ఎందువల్ల ఏర్పడుతుందో ఇంతవరకూ నిర్ధారణగా కనుగొనబడలేదు. కారణం కనుగొనబడకపోవటం వల్ల నివారణ కూడా నిర్ధారణగా చేయటం కష్టమే! కాని కాలక్రమేణా చాలామందికి ఈ రోగ లక్షణాలు సమసిపోతాయి. నరాల ప్రేరేపణని తగ్గించటానికి మందులు వాడటం, కడుపు గోడలలో ఏర్పడే "అల్సర్" మానటానికి మందులు వాడటం మాత్రమే ప్రస్తుత చికిత్సా విధానం.

### కె. కె. — అనకాపల్లి

నా వయస్సు 21 సంవత్సరములు. నేను పుట్టిన దగ్గరనుండి నా ముక్కు కొంచము పెద్దదిగా వున్నది. దానిని తిన్నగా ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నయము చేయవచ్చునా ?

★ తప్పకుండా నయంచేసే అవకాశం ఉన్నది. కాని సరిగా కుదరకపోయినప్పుడు ఇదివరకు ఉన్నదే బాగుండేది అనిపిస్తుంది.

### కె. టి. పి. — నిమ్మగడ్డ

నాకు ఒకొక్క సమయములో రెండు చెవులూ వినుపించటంలేదు. చెవిలో మానె వేసినపుడు పోటు లాగ వచ్చును. తరువాత దురద పుట్టును. దేనితో నైనా త్రిప్పినపుడు చెవిలోపల ఏదో అడ్డుపడ్డట్లుగా వుంటుంది. ఆవులించినపుడు లోపల 'డబ్ డబ్' అనే శబ్దము వినబడుతుంది. తరువాత చెవిలో చీము కారుతుంది.

★ ఈ లక్షణాలు మిడిల్ ఇయర్ ఇన్‌ఫెక్షన్‌ని (అటైటిస్ మీడియా) సూచిస్తుంది.

చెవులనుంచి కారే చీమును తీసి లేబరేటరీలో పరీక్షింపచేసి, అందులో ఉన్న క్రిములు ఏ యాంటీబయాటిక్‌కి లొంగుతాయో తెలుసుకొని ఆ మందుని చెవులలోకి వేయటం, మాత్రల రూపంలో లోనికి తీసుకోవటంవల్ల ఈ లక్షణం నయమవుతుంది.

### వి. పి. — కొత్తగూడెం

నా భర్త సింగరేణి కంపెనీలో 'బి. ఎఫ్' ఉద్యోగమునకు సెలక్షను అయి మెడికల్ ఫిట్‌కి వెళ్ళినారు. మెడికల్ ఫిట్‌లో నా భర్తకు దూరము చూపు ఎడమకన్ను 6/6, కుడికన్ను 6/18.3 వున్నదని మెడికల్‌లో అన్‌ఫిట్ అని చెప్పినారు. కనుక ఈ కుడికన్ను తిరిగి చూపుసరిగా వచ్చే అవకాశము వున్నదా ? మీ సలహా కోరుచున్నాను

★ ఈ దృష్టి లోపానికి నేత్రవైద్యులచేత పరీక్షింపచేసి కళ్ళజోడు వాడవలసి ఉంటుంది.

### కె. వి. ఎమ్. — మల్కనగిరి

మా ఆవిడ వయస్సు 32 సం॥లు. ఈవిడకు వుండి, వుండి వొళ్ళంతా బరువు అయిపోతున్నట్లు వుండటం, ఏది ముట్టుకున్నా ఎక్కువ దళసరిగా అనిపించటం, క్రిందకి చూస్తే భూమి లోతుగా కనిపించడము అవుచున్నది. ఈ విధంగా రెండు సంవత్సరములనుండి వున్నది. ఏదో మామూలు అనారోగ్యమున్నూ వస్తున్నదనుకున్నాము. కాని ఈమధ్య ఒకటి, రెండు మార్లు ఇలాగే వచ్చి వళ్ళు, కాళ్ళు, చేతులు చల్లబడిపోయాయి. దీనికి ఏమి చెయ్యాలి ?

★ మీరు మీ శ్రీమతిగారిని మెడికల్ స్పెషలిస్ట్‌లకి చూపించి, నెత్తురు, మూత్రం, మల పరిశోధన మొదలయినవి చేయించి రోగ నిర్ధారణ చేయించవలసి ఉంటుంది. బ్లడ్ కొలెస్టరాల్, ప్రోటిన్ బౌండ్ అయొడిన్ మొదలయిన పరీక్షలవల్ల రోగ నిర్ధారణ అవుతుందని నా అంచనా! ఈ పరీక్షల ఫలితాల ననుసరించి చికిత్సా విధానాలు నిర్ణయించబడతాయి.

### కె. ఎన్. — మచిలీపట్టణం

మా అమ్మాయి వయస్సు 15 సంవత్సరములు. ఇంకా పుష్పవతి అవలేదు. వైట్ డిశ్చార్జి అవుతున్నది. కాళ్ళు లాగుతున్నాయి అంటోంది. నడుము నెప్పి వుంటుంది ?

★ కొందరు చాలా ఆలశ్యంగా పుష్పవతి అవటం సహజమే! అనుమానం తీరటానికి లేడీ డాక్టర్ల వద్ద పరీక్షింపచేయటం మంచిది.

### డి. ఎన్. ఎమ్. — పోతునూరు

నా వయస్సు 18 సంవత్సరములు. నాకు రొమ్ములో గడ్డలు కట్టుచున్నవి. ఇలా కట్టినపుడు రొమ్ము వాచి బాగా నెప్పి పుట్టుచున్నది.

★ దీనికి వేడినీళ్ళ కాపు, ఆస్పిరిన్, నుగాన్‌రిల్ మాత్రల వాడకం, మాత్రమే చేయవలసి ఉంటుంది. వాపు బాగా ఎక్కువగా ఉండి, జ్వరం వస్తే యాంటీబయాటిక్‌లు వాడవలసి ఉంటుంది. ●

---

బోధపడింది. తల్లిదండ్రుల పరిస్థితి చూడలేక ఆ పరిణామాలకు తలవంచవలసి వచ్చింది.

నువ్వు మద్రాసెళ్ళిపోయిన తరువాత ఆ రోజే మొట్టమొదటిసారిగా గుర్తొచ్చావ్ ...

సిగ్గుపడ్డాను.

రెండు పెళ్ళిల్లూ క్రిందటి నెల జరిగాయి.

కావాలనే నీకు పెళ్ళి కార్డు పంపలేదు — క్షమించు.

ముఖ్యంగా ఒక విషయం -- మేం నలుగురం ఈ నెల పదునాల్గవ తేదీని బయలుదేరి మెయిలుకి వస్తున్నాం నీ దగ్గరకొచ్చి, అలా తిరుపతి వెళ్దామని. పదుహేను ఉదయం మద్రాస్ సెంట్రల్‌కి వస్తావ్ కదూ. శలవ్.

ప్రేమతో —

నీ దగ్గర ఓడిపోయిన,

'సాంబ.'

## సంఘం గెలిచింది...

అదండీ వాడు రాసిన ఉత్తరం 'యాజ ఇటీజ'గా.

మరి ఈ మాత్రం దానికే 'సావుకేజీ బరువనీ, నువ్వు పత్రిక్కి రాసిన కధంత అనీ మొదట్లో జోగావెందుకూ' అనరూ, మీరు ?

అక్కడే వుందండీ కిటుకంతా.

నేనో రచయితలా కొంతసేపు ఫీలయిపోదామని, వాడు 'ఫ్రీసెక్స్' అనే 'క్లూ' ఇచ్చినట్లూ, అది పట్టుకుని జరిగిన విషయం నేనే చెప్పినట్లు రాసాను.

కాని అదంతా మోసం — వాడు ఉత్తరంలో రాసిన విషయాలే అవన్నినూ.

నాకేగనక పాత సంగతులు గుర్తుంటే ఈపాటికి ఓ పేద్ద రచయితనైపోయి, అందరిలాగా మిమ్మల్ని సాహిత్య బాధితుల్ని చెయ్యనూ! (ఇప్పుడు మాత్రం తక్కువ తిన్నానా!)

సార్... సార్... మేడమ్... పుస్తకం మూసేయకండి... ప్లీస్... ఇంకొక్క నిముషం నాతో సహకరించి, మీ తల భారం తగ్గించేసుకోండి.

నేను మిమ్మల్నో ప్రశ్న వేస్తాను.

నేను : సాంబ ఓడిపోయినట్టు తనకు తానుగా ఒప్పుకుంటున్నాడు. అయితే మరి నేను గెలిచినట్లూ, సాంబగాడు ఓడిపోయినట్లూ మీరు భావిస్తున్నారా ?

(నేను ఊహించిన) మీ సమాధానం : హారి దేవుడా (బాధపెట్టువాడే భగవత్స్వరూపుడు గదా మరి!) మమ్మల్నొదిలెయ్... మున్మాటికీ నువ్వే గెలిచావ్... ముమ్మమ్ముమ్మాటికీ సాంబ ఓడిపోయాడు... రామచంద్రా... సీతాపతే... రక్షించు తండ్రీ.

కాదు.

నా అభిప్రాయం : సంఘం గెలిచింది — మనిషి ఓడిపోయాడు. ★